క్లుప్తంగా

150 మందికి ఉచిత వైద్య సేవలు

మంగళగిరి: నగరానికి చెందిన దామర్ల శివరామకృష్ణ, రామసీతమ్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రాజీవ్ గృహకల్ప సమీపంలోని రామాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ దామర్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ వైద్య శిబిరంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: కనకదుర్గ వారధిపై నుంచి కృష్ణా నదిలోకి దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం తాడేపల్లి పోలీసులు ఆ వృద్ధుడి మృతదేహాన్ని బయటకు తీసి కృష్ణా జిల్లా గొల్లపూడి పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం .. యలవర్తి సత్యనారాయణస్వామి (60) గొల్లపూడిలోని క్రషర్‌లో పనిచేస్తుంటారు. అతనికి నలుగురు పిల్లలు ఉన్నారు. శనివారం ఉదయం 'నేను ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నాను. ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా కోసం వెతకవద్దు' అంటూ సూసైడ్ నోట్ రాసి వెళ్లిపోయినట్లు వారి బంధువులు స్థానిక పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఆ సమాచారం మేరకు మృతదేహాన్ని గొల్లపూడి పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్ష

1000 మందికి గాను 890 మంది హాజరు



లాం(తాడికొండ): తాడికొండ మండలంలో ఆదివారం నిర్వహించిన కానిస్టేబుల్ ఎంపిక రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. లాం చలపతి ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో మొత్తం 1000 మంది విద్యార్థులకు గాను 890 మంది హాజరు కాగా, 110 మంది గైర్హాజరయ్యారు. ఉదయం నుంచి పోలీసు బందోబస్తు నడుమ విద్యార్థులను పకడ్బందీగా చెకింగ్ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. సీఐ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవడంతో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

పేద విద్యార్థికి రూ.50 వేల ఆర్థిక సాయం



మంగళగిరి: పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో ఓ పేద విద్యార్థికి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నగరంలోని పోలేరమ్మ గుడి వద్ద పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘ కార్యాలయంలో ఆదివారం నగరానికి చెందిన జంజనం అనుదీప్ అనే బీటెక్ విద్యార్థికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు చేతుల మీదుగా ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామర్ల కుబేరస్వామి, సంఘం నాయకులు చింతకింది కనకయ్య, గంజి రవీంద్రనాథ్, తాటిపాముల లక్ష్మీపెరుమాళ్, జంజనం భిక్షారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభావితం చేయగలిగే శక్తి గురువులదే

సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో అంతర్గత శక్తులను ప్రభావితం చేయగలిగే మహత్తర శక్తి గురువులదేనని సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత పేర్కొన్నారు. ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఆదివారం 'విద్యార్థులు వారి భవిత– దశ దిశ, తల్లిదండ్రుల బాధ్యత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ సరిత మాట్లాడుతూ సృష్టిని నడిపిస్తున్న శక్తి గల భగవంతుడు మాదిరిగా గురువుకు విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దే శక్తి ఉందని అన్నారు. రేపటి దేశ భవిష్యత్తు మార్చగలిగే శక్తి ఉన్న పౌరులుగా విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాత్ర ఎంతో కీలకమన్నారు. తినడానికి తిండి లేని పరిస్థితుల నుంచి దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవిని అధిష్టించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం తన గురువు వేసిన పునాది వలనే దేశ ప్రగతికి దిశ, దశ చూపారని అన్నారు. విద్యార్థులందరు దేశానికి విత్తనం వంటి వారని, దేశంలో 40 శాతం జనాభా విద్యార్థులేనని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్ర బాబు, డైరెక్టర్ మేకల శేషకుమారి, ప్రిన్సిపాల్ కల్యాణి, హెచ్ఎం మీనాక్షి పాల్గొన్నారు.

మెల్లెంపూడిలో ఎస్సీ శ్మశానవాటిక పూర్తి

- స్థలం కేటాయించి నిర్మాణం పూర్తిచేసిన ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు
- ఎస్సీలకు తొలగిపోయిన ఇబ్బందులు



ఎస్సీ శ్మశానవాటిక చుట్టూ నిర్మించిన ప్రహరీ



శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన షెడ్డు

తాడేపల్లిరూరల్: మెల్లెంపూడి ఎస్సీ కాలనీకి శ్మశానవాటిక ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మెల్లెంపూడి ప్రాంతంలో ఎస్సీ కాలనీ వాసులకు శ్మశానవాటిక లేక గతంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళగిరి శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇటీవల మెల్లెంపూడి పర్యటనలో స్థానిక ఎస్సీలు శ్మశానవాటిక లేక పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే వారం రోజుల్లో మెల్లెంపూడిలోనే 25 సెంట్ల భూమిని శ్మశానవాటికకు కేటాయింపజేశారు. రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ పనులు ఆదివారం నాటికి పూర్తికావడంతో మెల్లెంపూడి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉండవల్లి సెంటర్, రేవేంద్రపాడు మధ్య మెల్లెంపూడి గ్రామంలో రోడ్డు పక్కన స్థలం కేటాయించి శ్మశానవాటికకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం కూడా పూర్తి చేశారు. చుట్టూ ప్రహరీ నిర్మించి, వీధిలైట్లు ఏర్పాటు చేశారు. అంత్యక్రియలు నిర్వహించిన అనంతరం గ్రామంలో ఇళ్లు లేనివారు నిద్ర చేసేందుకు ఒక గదిని, బాత్‌రూమ్‌లు, టాయిలెట్లను కూడా నిర్మించారు. మెల్లెంపూడి ఎస్సీ కాలనీ వాసులు గతంలో తమ బంధువులు చనిపోతే బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున ఖాళీ ప్రదేశంలో అంత్యక్రియలు నిర్వహించేవారు. పెద్దలు చనిపోయిన తరువాత కాలువ ఒడ్డున వారి పెద్దల సమాధుల కట్టడంపై తీవ్ర మనస్తాపానికి గురయ్యేవారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆర్కే స్థలం కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడంపై గ్రామస్తులు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఇంత త్వరగా పూర్తి చేస్తారనుకోలేదు



ఎమ్మెల్యే ఆర్కే మెల్లెంపూడి వచ్చినప్పుడు మా సమస్యను విన్నవించుకున్నాం. వారం రోజుల్లో తాడేపల్లి తహసీల్దార్ మా శ్మశానవాటికకు 25 సెంట్ల భూమిని కేటాయించారు. హమ్మయ్యా.. స్థలం కేటాయించారులే అనుకున్నాం. అనంతరం రూ.18 లక్షలతో చుట్టూ ప్రహరీ, అభివృద్ధి పనులు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అది జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు. ఎమ్మెల్యే ఆర్కే ఇచ్చిన హామీ ప్రకారం ప్రహరీ నిర్మించడమే కాకుండా మరో రూ.2 లక్షలు కేటాయించి గదిని సైతం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయం. – కొరివి సుధాకర్

ఎప్పుడూ ఈ విధంగా అభివృద్ధి జరగలేదు



తాడేపల్లి మండల కేంద్రానికి శివారులో ఉండే మెల్లెంపూడి ప్రాంతంలో ఒకేసారి ఎప్పుడూ ఇంత అభివృద్ధి జరగలేదు. ఎమ్మెల్యే ఆర్కే మెల్లెంపూడిపై ప్రత్యేక దృష్టి సారించి ముందుగా రైతుల కష్టాలు తీర్చారు. మా గ్రామానికి రావడానికి నాలుగు రోడ్లు ఉన్నప్పటికీ ఏ రోడ్డూ సరిగా లేదు. ఇప్పటికే రెండు రోడ్ల నిర్మాణం రూ.50 లక్షలతో పూర్తి చేశారు. మరో రెండు రోడ్లు త్వరలోనే పూర్తికావడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇంత భారీగా ఏ ప్రభుత్వంలోనూ మా మెల్లెంపూడికి ఖర్చు చేయలేదు. – ఈదులమూడి శేఖర్, మాజీ ఎంపీటీసీ

ఏది అడిగినా కాదనని మనిషి ఎమ్మెల్యే ఆర్కే



ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఏ పార్టీ వారు ఏ పని అడిగినా కాదనకుండా పనిచేసే వ్యక్తి. సమాజానికి ఉపయోగపడేవిధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఆయన దృష్టికి సమస్యను తీసుకెళితే దానిని క్షుణ్ణంగా పరిశీలించి అధికారులతో మాట్లాడి ఆ సమస్యను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో తెలుసుకుని వెంటనే పనులు చేపట్టి పూర్తి చేస్తారు. ఇలాంటి ఎమ్మెల్యే మన నియోజకవర్గంలో ఉండటం ఎంతో సంతోషించదగ్గ విషయం. రాజకీయాల్లో విమర్శలు లేకుండా పనిచేస్తున్న గొప్ప వ్యక్తి ఎమ్మెల్యే ఆర్కే. – షేక్ ఖాన్

గుండిమెడలో కేవీపీఎస్ ప్రదర్శన

- ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు ఆర్డినెన్స్ తీసుకురావాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి



ప్రదర్శన నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు

తాడేపల్లిరూరల్: ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం కాలపరిమితి ఈ నెల 23వ తేదీతో ముగుస్తుండటంతో శాశ్వతంగా సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ ఆదివారం తాడేపల్లి మండల పరిధిలోని గుండిమెడ గ్రామంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దళితులు, గిరిజనులకు కేటాయించాలని కోరుతూ 2004 నుంచి కేవీపీఎస్, దళిత గిరిజన సంఘాలు అనేక పోరాటాలు చేశాయన్నారు. ఫలితంగా 2013లో ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఇటీవల హైకోర్టు ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను మళ్లించడం అన్యాయమని, ఆ నిధులను వెనక్కి తీసుకువచ్చి దళిత గిరిజనులకు ఖర్చు చేయాలని తీర్పు చెప్పిందని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని స్పష్టంగా అమలు చేసేందుకు అసెంబ్లీలో సమావేశాలు జరపాలని, శాశ్వతంగా చట్టాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ శారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పల్లె కృష్ణ, కేవీపీఎస్ గుంటూరు జిల్లా కన్వీనర్ నల్లపు కిషోర్‌బాబు, కేవీపీఎస్ జిల్లా నాయకులు జెట్టి రాంబాబు, దాసరి అజయ్‌కుమార్, గంగయ్య, బుజ్జి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అగ్ని సంస్కారం



అగ్ని సంస్కారం నాటికలోని సన్నివేశం

పాత గుంటూరు: బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ శతజయంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సభకు సంస్థ కార్యదర్శి కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పూర్వ శాసన సభాపతి కె.ప్రతిభా భారతిని ఎన్టీఆర్ శతజయంతి పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వంగివరపు శారద, డాక్టర్ నాగశ్రీ, పర్వతనేని హరిత, రామరాజు లక్ష్మీ శ్రీనివాస్, డాక్టర్ కె.సీతాదేవి, ఆలయ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, కావూరి సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం అభినయ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన అగ్ని సంస్కారం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఎ. రాహుల్ రచనకు వై.భవాని దర్శకత్వం వహించారు.

స్కోప్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

నెహ్రూనగర్: పేద పిల్లలకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న స్కోప్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు) తెలిపారు. ఆదివారం స్కోప్ డైరెక్టర్ డాక్టర్ దేవరపల్లి కొండలరావును డెప్యూటీ మేయర్ ఆయన కార్యాలయంలో అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం కాలపరిమితి పెంపుపై హర్షం

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పునరుద్ధరిస్తూ ప్రభుత్వం జీఓ తీసుకురావడం అభినందనీయమని డీబీఎఫ్ అధ్యక్షుడు కొరివి వినయకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2013లో సబ్‌ప్లాన్ చట్టం పదేళ్ల కాలపరిమితితో అమలులోకి వచ్చింది. 2023తో గడువు ముగుస్తుండటంతో ప్రభుత్వం చట్టాన్ని పునరుద్ధరిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడంపై సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు చెప్పారు. దళిత, గిరిజనుల సామాజిక ఆర్థిక సాధికారితకు ఎంతగానో ఉపయోగపడే ఈ చట్టానికి కాలపరిమితి లేకుండా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

తాడికొండ టీడీపీలో గ్రూపుల విభేదాలు

- శ్రావణ్‌కు వ్యతిరేకంగా రాయపాటి గ్రూపు సమావేశం
- అభ్యర్థిగా తోకల రాజవర్ధన్‌ను ప్రతిపాదన



మాట్లాడుతున్న రాయపాటి శ్రీనివాస్, తోకల రాజవర్ధన్ తదితరులు

తాడికొండ: తాడికొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో గ్రూపు విభేదాలు, దొడ్డిదారి రాజకీయాలు ఒక్కొక్కటిగా పొడచూపుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు వ్యతిరేకంగా తోకల రాజవర్ధన్‌ను రాబోయే ఎన్నికల్లో అభ్యర్థిగా పరిచయం చేస్తూ రాయపాటి శ్రీనివాస్ నేరుగా రంగంలోకి దిగి ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. లచ్చన్నగుడిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తోకల రాజవర్ధన్ స్థానికుడు, సౌమ్యుడుగా మంచి పేరుందని, రాబోయే రోజుల్లో తాడికొండ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ముందుకొచ్చారని చెప్పారు. ఎన్నికల ఏడాది సమీపిస్తున్న వేళ రాయపాటి వర్గం తెరపైకి కొత్త వ్యక్తిని తీసుకురావడం, గతంలో కూడా నియోజకవర్గంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు శ్రావణ్‌కు సీటిస్తే ఓడిస్తాం అంటూ ప్రచారం చేసిన నేపథ్యంలో టీడీపీ అధిష్టానం ఎవరికి సీటు కేటాయిస్తుందో అనేది వేచి చూడాల్సిందే.

25న జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ రేవూరి హరికృష్ణ

గుంటూరు మెడికల్: ధృతి హాస్పిటల్స్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) గుంటూరు నగర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ధృతి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రేవూరి హరికృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక కొత్తపేట గౌరీశంకర్ థియేటర్ రోడ్డులోని ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉచిత వైద్యశిబిరంలో బ్లడ్ షుగర్, హిమోగ్లోబిన్, లిపిడ్ ప్రొఫైల్, కిడ్నీ, లివర్ ఫంక్షన్స్, థైరాయిడ్, చెస్ట్ ఎక్సరే, ఈసీజీ, అల్ట్రాసౌండ్ స్కానింగ్, 2డీ ఎకో టెస్ట్, దంత వైద్య పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ.10వేల రూపాయల విలువ చేసే వైద్య పరీక్షలు చేయనునన్నట్లు చెప్పారు. పేర్లను ముందస్తుగా 9858190190 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తమ పేర్లు నమోదు చేసుకున్నవారికి మాత్రమే వైద్యశిబిరంలో ఉచితంగా పరీక్షలు చేసి వైద్యసేవలను అందిస్తారని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో జర్నలిస్ట్ యూనియన్ నగర అధ్యక్షుడు వజ్రె కిరణ్ కుమార్, సెక్రటరీ కందా ఫణీంద్రకుమార్, కోశాధికారి పఠాన్ ఆసిఫ్‌ఖాన్, ఐజేయూ సభ్యుడు గిరిధర్, జిల్లా సభ్యుడు షేక్ కరీం పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించడంపై కేసు నమోదు

ఫిరంగిపురం: మంచినీటి చెరువు మట్టిని అక్రమంగా లారీలో తరలిస్తున్నారని తెలియడంతో ఆపేందుకు వెళ్లిన వీఆర్వోను అడ్డగించిన సంఘటన నుదురుపాడులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నుదురుపాడు గ్రామ శివారులోని మంచినీటి చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారనే సమాచారంతో అక్కడకు వెళ్లి మట్టి లోడుతో ఉన్న లారీని ఆపిన వీఆర్వో శివకోటేశ్వరరావుపై గ్రామానికి చెందిన సుధాకరరెడ్డి, అయ్యప్ప దౌర్జన్యం చేశారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో శివకోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తాడికొండ: తాడికొండ బీఎస్ఎస్‌బీ కళాశాలలో 1990–91, 1992–93 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అలనాటి విద్యార్థులంతా కళాశాలకు చేరుకొని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి అధ్యాపకులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.పూర్ణచంద్రరావు, ఎస్‌వీ చలపతిరావు, పి.హనుమంతరావు, వీవీజీకే ఆచార్యులు, ఆర్‌వీ కృష్ణారావు, ఏవీ రాఘవయ్య, బి.అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

అలీని కించపరిచే వ్యాఖ్యలు సరికాదు

వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశిస్తే జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై పోటీ చేస్తానని సినీ నటుడు, రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సలహాదారు అలీ ఇటీవల చెప్పడంపై కొందరు జనసేన నేతలు కించపరిచే వ్యాఖ్యలు చేయడం తగదని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, ముస్లిం కుటుంబానికి చెందిన అలీ ఎవరి అండదండలు లేకుండా సినీ పరిశ్రమకు బాలనటుడుగా వచ్చి ఎన్నో కష్టాలను చవిచూసి స్వయం కృషితో 1000కి పైగా సినిమాల్లో నటించి ఈ స్థాయికి చేరుకున్నారన్నారు. సినిమాల్లో కలిసి నటించినంత మాత్రాన పవన్ కల్యాణ్‌పై పోటీ చేయకూడదా? అని ప్రశ్నించారు. అలీ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నానని ప్రకటించడం హర్షణీయమని, జనసేన నేతలు ఈ విషయాన్ని గ్రహించాలన్నారు. సమావేశంలో షేక్ బాజీ, షేక్ సైదా, షేక్ కొనేస్, సయ్యద్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన కలిగిఉండాలి

అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ జీఎస్‌టీ శ్రీధర్



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ జీఎస్టీ శ్రీధర్

మంగళగిరి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ (జీఎస్‌టీ)పై వ్యాపారులు అవగాహన కలిగిఉండాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ జీఎస్‌టీ శ్రీధర్ పేర్కొన్నారు. నగరంలోని మెయిన్ బజారు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. జీఎస్టీ విధానంపై కేంద్రం దేశ వ్యాప్తంగా ఒకే చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ చట్టం వల్ల మధ్య తరగతి వ్యాపారులకు ఎటువంటి నష్టం లేదన్నారు. దేశ వ్యాప్తంగా ఒకే చట్టం తీసుకురావడం వల్ల ఏ రాష్ట్రంలో వ్యాపారం చేసినా ఒకే వ్యాట్, సర్వీస్ టాక్స్ చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో చార్టెర్డ్ అకౌంటెంట్ మద్ది నిఖిల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సంకా బాలాజీ గుప్తా, వీసం వెంకటేశ్వరరావు, మద్దుల ప్రసాద్, జొన్నాదుల ఫణి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులు

6 గంటల్లో మూడు కిలోమీటర్లు



తుళ్లూరు మండలం వెంకటపాలెం నుంచి ఉండవల్లి వరకు నిర్మించిన తారురోడ్డు

తాడేపల్లిరూరల్: కృష్ణా నది అమరావతి కరకట్ట వెంబడి ఉన్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని ఇరిగేషన్ అధికారులు ఆదివారం 6 గంటల వ్యవధిలో పూర్తి చేశారు. ఈ రహదారిలో ప్రతి రోజూ హైకోర్టు న్యాయమూర్తులతో పాటు పలువురు వీవీఐపీలు పర్యటిస్తుండటంతో పగటి సమయంలో నిర్మాణ పనులు నిర్వహించడం కష్టసాధ్యంగా మారింది. ఆదివారం సెలవు కావడంతో ఇరిగేషన్ అధికారులు శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కరకట్ట వద్ద ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ వద్ద రహదారిని మూసివేసి కృష్ణాయపాలెం నుంచి ఉండవల్లి వరకు ఉన్న రోడ్డులో గోతులు పూడ్చి ఉదయం 6 గంటల కల్లా రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేశారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి సాయంత్రం 6 గంటలకు మరో రెండు రోడ్లు పూర్తి చేశారు. సోమవారం హైకోర్టుకు వెళ్లే న్యాయవాదులు, సచివాలయానికి వెళ్లే అధికారులకు ఇబ్బంది లేకుండా మొత్తం 5 కి.మీ. మేర రోడ్డు నిర్మించామని మరో రెండు రోజుల్లో మార్జిన్లు వేసి పూర్తి చేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలియజేశారు.

రెచ్చిపోయిన రౌడీ షీటర్

- మద్యం మత్తులో అర్ధరాత్రి లారీ డ్రైవర్‌పై దౌర్జన్యం
- లారీని తీసుకెళ్లిన రౌడీ షీటర్
- 100కు కాల్ చేసిన లారీ డ్రైవర్
- లారీని ఛేజ్ చేసి పట్టుకున్న పోలీసులు
- ఫిర్యాదు చేసేందుకు భయపడుతున్న లారీ యజమాని

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో ఉండే ఓ రౌడీ షీటర్ మరోసారి రెచ్చిపోయి జాతీయ రహదారిపై కనకదుర్గ వారధి వద్ద ఓ లారీని ఆపి, డ్రైవర్‌పై దౌర్జన్యం చేసి లారీ తీసుకెళ్లిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సదరు డ్రైవర్ 100కు డయల్ చేయడంతో పోలీసులు లారీని విజయవాడ భవానీపురం లారీ స్టాండ్‌లో రౌడీ షీటర్ వల్లపు హరికృష్ణ (హరి) పార్కింగ్ చేసి వెళ్లినట్లు గుర్తించారు. ఆ లారీని పోలీసులు తీసుకువచ్చి స్పందనలో భద్రపరిచారు. ఈ ఘటనలో హరికృష్ణపై ఫిర్యాదు చేసేందుకు లారీ డ్రైవర్, యజమాని భయభ్రాంతులకు గురవుతున్నారు. హరికృష్ణ గతంలో మంగళగిరి పరిధిలో రాజధాని రోడ్డును తవ్విన ఘటనలో ప్రధాన వ్యక్తి. అలాంటి వ్యక్తిపై అప్పట్లో మంగళగిరి రూరల్ పోలీసులు కేసు కూడా నమోదు చేయలేదు. పోలీసులు ఆ కేసులో రెండు జేసీబీలు, నాలుగు లారీలను సీజ్ చేసి వాటికి సంబంధించిన యజమానులను కేసులో ముద్దాయిలుగా చేర్చారు. ప్రధాన సూత్రధారి అయిన హరిని మాత్రం అప్పట్లో వదిలివేయడం పట్ల నాటి సీఐ పాత్ర ఉన్నట్లు గుసగుసలు వినిపించాయి. మంగళగిరి నియోజకవర్గంలో పలుచోట్ల ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టిన వ్యక్తుల్లో ప్రధానపాత్ర హరికృష్ణదే. గత కొంతకాలం క్రితం సీతానగరంలో ఇరిగేషన్ అధికారులు నిల్వ చేసిన మట్టిని దొంగిలించిన ప్రధాన ముద్దాయి ఇతనే. తాడేపల్లి పోలీసులు ఈ ఘటనపై కేసు కూడా నమోదు చేశారు. తెలంగాణ నుంచి పాల వ్యాన్‌లో మద్యం తీసుకువచ్చి తన ఏజెంట్ల ద్వారా అమ్మకాలు నిర్వహిస్తున్న రౌడీ షీటర్ హరికృష్ణపై అక్రమ మద్యం కేసులు కూడా నమోదు అయ్యాయి. ఇలాంటి వ్యక్తి మళ్లీ లారీ డ్రైవర్‌పై దౌర్జన్యం చేసి లారీని తీసుకెళ్లడంపై లారీ యజమానులు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ సంఘటనపై పోలీసులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

హేతువాద ఉద్యమ నేత రావిపూడికి నివాళి



రావిపూడి వెంకటాద్రికి నివాళులర్పిస్తున్న అవగాహన కార్యదర్శి కొండాశివరామిరెడ్డి

లక్ష్మీపురం: బహుముఖ ప్రజ్ఞాశాలి హేతువాద ఉద్యమనేత రావిపూడి వెంకటాద్రి మృతి హేతువాద ఉద్యమానికి తీరని లోటని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో రావిపూడి వెంకటాద్రి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిపురనేని రామస్వామి, ఎంఎస్ రాయ్ రచనలతో ప్రభావితుడై ప్రముఖ సంఘ సంస్కర్తలు పెరియార్ అన్నాదురైల సహచర్యంతో హేతువాద ఉద్యమాన్ని నిర్మించినట్లు చెప్పారు. పలు అంశాలపై లోతైన అధ్యయనం చేసి సుమారు 100 పుస్తకాలు రాశారని 102వ సంవత్సంలోకి అడుగు పెట్టి కూడా హేతువాది పత్రికకు వ్యాసాలు రాస్తూనే ఉన్నారని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, తెలుగు పండితులు రాజన్న మాస్టర్, యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ పాల్గొని నివాళులర్పించారు.

చెవి, ముక్కు గొంతు సమస్యలపై నిర్లక్ష్యం తగదు

లక్ష్మీపురం: వృద్ధాప్యంలో చెవి, ముక్కు, గొంతు సమస్యలు అధికమవుతూ ఉంటాయని వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని ప్రముఖ ఈఎన్‌టీ డాక్టర్ బయ్యా శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, టి.నారపరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు.